
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జనగామ
శుక్రవారం 4 జూలై 2025





టీబీ రహిత జిల్లాగా మార్చాలి

జనగామ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జనగామను టీబీ రహిత జిల్లాగా మార్చాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, అదనపు కార్యదర్శి అరుంధతి పట్నాయక్ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీబీ ముక్త్ భారత్ అభియాన్ అవగాహనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వైద్య శాఖ అధికారులతో కలిసి పింకేశ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యాధి బారినపడే అవకాశం ఉన్న 1,21,613 మందికి పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 736 మందికి ఎక్స్‌రే పరీక్షలు, 786 మందికి నాట్ ద్వారా టీబీ పరీక్షలు చేశామని, 43మందిని టీబీ వ్యాధిగ్రస్తులుగా గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో మల్లికార్జున్ రావు పాల్గొన్నారు.



జఫర్‌గడ్ మండలం తిమ్మాపూర్‌లో ఆయిల్‌పామ్ సాగు

ఉద్యాన పంటలపై ఉత్సాహం

జిల్లాలో ఏటా పెరుగుతున్న సాగు



- ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి
- మొక్కల పెంపకానికి సర్కారు సబ్సిడీ
- 3,500 ఎకరాల ఆయిల్‌పామ్.. 148 ఎకరాల్లో పండ్ల తోటలు లక్ష్యం
- పండ్ల తోటల పెంపకానికి ఆర్థిక సాయం
- పూలతోటల సాగుకూ చేయూత
- విస్తీర్ణం పెంచేందుకు అధికారుల కార్యాచరణ

జఫర్‌గడ్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. రైతులకు భారీగా రాయితీలు ఇచ్చి ఉద్యానసాగును ప్రోత్సహిస్తున్నారు. సంప్రదాయ పంటలకు బదులు ఉద్యాన పంటలు సాగు చేస్తే ఎంతో ప్రయోజనకరం. సన్న, చిన్నకారు రైతులు ఉద్యాన పంటలైన పండ్ల తోటల సాగుకు సర్కారు ప్రోత్సహిస్తోంది. ఇందుకనుగుణంగా ఆయిల్‌పామ్ సాగుతోపాటు వివిధ పండ్ల తోటల పెంపకానికి రాయితీలను వర్తింపజేస్తోంది. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉద్యానశాఖ పంటల సాగుపై వార్షిక ప్రణాళికను ఖరారు చేసింది. జిల్లాలో 2025-26 సంవత్సరానికి ఆయిల్‌పామ్ సాగు 3,500ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించగా, 148 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచేందుకు లక్ష్యంగా నిర్దేశించారు. దీనిని సాధించే దిశగా అధికారులు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

పండ్ల తోటల సాగు-రైతుకు అందే సాయం

పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పండ్ల ఉత్పత్తి లేక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వాటి కి మార్కె ట్‌లో నానాటికి డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పండ్ల తోటల సాగును పెంచేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. మామిడి, జామ, సపోట, మునగ, చింత, డ్రాగన్ ఫ్రూట్, నారింజ, బత్తాయి, కొబ్బరి, దానిమ్మ, ఆయి ల్‌పామ్, అల్లనేరేడు వంటి పండ్ల తోటలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రకాల పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు తోటల రకాలను బట్టి ఆర్థిక సాయం అందించ నుంది. పూల తోటల పెంపకంలో భాగంగా బంతి, చామంతి, మల్లె, లోకల్ గులాబీ, తదితర వాటికి 40 శాతం రాయితీ ఇస్తున్నారు. పాత మామిడి తోటల పునరుద్ధరణ, నీటి గుంటలు, మల్చింగ్ విధానం, సోలార్ డ్రైయర్స్, యాంత్రీకరణకు సబ్సిడీపై అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రకం	లక్ష్యం (ఎకరాల)	యూనిట్ ధర	పెట్టుబడి సాయం (40శాతం రాయితీ)
మామిడి	65	రూ.80,000	రూ.32,000
సీతాఫలం	2.50	రూ.30,000	రూ.12,000
జామ	10	రూ.80,000	రూ.32,000
నిమ్మ	7.50	రూ.80,000	రూ.32,000
అరటి	25	రూ.70,000	రూ. 28,000
పపాయి	20	రూ.30,000	రూ.12,000
అవకాడో	7.50	రూ.50,000	రూ.20,000
డ్రాగన్ ఫ్రూట్	09	రూ.2,70,000	రూ.1,08,000

పెరుగుతున్న సాగు

జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల సాగు క్రమంగా పెరు గుతోంది. వ్యవసాయంలో విప్లవాత్మక

(మిగతా 8వ పేజీలో)

రైతులను ప్రోత్సహిస్తున్నాం...

- శ్రీధర్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, జనగామ



వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో ఒకటైన ఉద్యాన పంటలు కూడా అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చక్కటి అవకాశం. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఆశించిన స్థాయిలో సాగుతోం ది. ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఉద్యాన పంటలకు ఇచ్చే రాయి తీలు, ప్రయోజనాలను అర్హులైన ప్రతీ రైతుకు అం దించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఏటేటా పెరుగుతోంది. నాటిన నాలుగేళ్ల తర్వాత కాపు మొదలై 30 ఏళ్ల వరకు దిగుబడి ఉంటుంది. వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

దొరతనంపై రణకేతనం

- నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య
- వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో ఎగిసిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి

6లో



దొడ్డి కొమురయ్య (ఊహా చిత్రం)



కడవెండి ఎంట్రన్స్‌లో యోధుల స్మారక స్థూపాలు

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు - 8లో



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్



బండ్లగూడెంలో ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

లింగాల ఘనపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడెంలో ఇందరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా పరిశీలించారు. లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ పునాది నిర్మాణాలు పూర్తైన స్థాయిలో ఎంత ఖర్చు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. ప్లింత్ బీమ్ పూర్తి చేసేవరకు రూ.లక్ష ఖర్చు దాటకూడదని సూచించారు. ఇసుక రవాణా కోసం ఒక్కో ట్రిప్‌కి రూ.3,500 ఖర్చు అవుతుందని, లబ్ధిదారులు తెలుపగా రూ.1,500 మించకుండా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐరన్, హార్డ్‌వేర్ షాపు యాజమానులతో కూడా మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధరలు పెంచకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. సూర్యాపేట నుంచి ఇసుక రవాణా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లును చేపడుతున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ నమూనా మోడల్ కంటే అనవసరంగా ఎక్కువ కొలతలతో ఇల్లు కట్టుకోవద్దని సూచించారు. అంతకుముందు లింగాలఘనపురం మండల కేంద్రంలోని ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని సందర్శించి ఎరువులు, విత్తనాల, పురుగుల మందుల స్టాక్ వివరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, ఏవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, సంతోషిమాత పాల్గొన్నారు.

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు

- పక్కా ప్రణాళికతో అమలు చేయాలి
- మహాజాతర ఏర్పాట్ల పూర్తికి ఆరునెలల సమయం ఉంది
- క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్‌పై నివేదిక సమర్పించాలి
- ఆదివాసి సంప్రదాయాలకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు
- భూసేకరణకు పూజారులు, గిరిజనులు సహకరించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్



మేడారం పరిసరాలను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్



వనదేవతల గద్దెల డిజైన్

ములుగు/తాడ్వాయి జూలై 3(ఆంధ్రజ్యోతి): రెండేళ్లకో సారి జరిగే మేడారం మహాజాతరకు పక్కా ప్రణాళికలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గద్దెల పరిసరాలను, క్యూలైన్లు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, కన్నెపెల్లి సారలమ్మగుడి, చిలకలగుట్ట పరిసరాలు జిల్లా కలెక్టర్ దివాకర, సీఎస్ సలహాదారు గోవిందహరితో కలిసి పరిశీలించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తదనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశ మందిరంలో మహా జాతర అభివృద్ధిపనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వాస్తుశిల్పి రాజశేఖర్ మేడారం మాస్టర్ ప్లాన్‌ను స్లైడ్ షో ద్వారా పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ స్లైడ్ షోలో జంపన్నవాగు అభివృద్ధి పనులు, పలు వంతెలనల ఏర్పాటు, అధునాతన కూడళ్ల ఏర్పాటు, రోడ్డు విస్తరణ పనులు, దేవస్థానం చుట్టూ అభివృద్ధి, భక్తుల కోసం విశాలమైన క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, భక్తుల వసతి, పూజారుల వసతి, గిరిజన సంఘాల వసతి, స్నాన ఘట్టాలు, అన్నదాన సత్రాలు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, గద్దెలు, పరిసరాలు ముఖ ద్వారాలు రాతి కట్టడాలతో నిర్మించేలా చేసిన డిజైన్‌లను చూపించారు.

అనంతరం శైలజారామయ్యర్ మాట్లాడుతూ 2026 మహా జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉన్నత సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 100 ఏళ్లకు పైగా నిలిచి ఉండేలా శాశ్వత నిర్మాణాలు చేపడతా మన్నారు. మేడారం అభివృద్ధికి పూజారులు, దేవాదాయశాఖ, గిరిజన శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి సులువైన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఆధ్యాత్మికత పెంపొందేలా అభివృద్ధి చేపడతామని అన్నారు. గిరిజనులు, పూజారులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలన్నారు.

అభివృద్ధి పనులకు ఆరు నెలల సమయం ఉందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగేలా శాశ్వత పనులకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడారం అభివృద్ధి జరగాలంటే భూసేకరణ ప్రధానమన్నారు. మేడారం గిరిజనులు, పూజారులు భూసేకరణకు అడ్డు పడకుండా సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంలో ఏమైన సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దివాకర ద్వార మీ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియపరచాలన్నారు. మాస్టర్ ప్లాన్‌ను వాస్తు శిల్పి అద్భుతంగా రూపొందించారని అభినందించారు.

ప్రాణం తీసిన పోలీసు భయం

- చల్వాయిలో ఉరివేసుకొని నిరుపేద యువకుడి బలవన్మరణం
- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టింగ్‌లు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- సెల్‌ఫోన్ స్వాధీనం.. స్టేషన్‌కు రావాలని ఆదేశం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య
- రాస్తారోకో చేసిన బంధువులు, బీఆర్‌ఎస్ శ్రేణులు
- వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు నమోదు



రమేష్ (ఫైల్)

6లో



మనవడు రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న అమ్మమ్మ విశాల

పేదలకు ఇళ్లు నిర్మించడమే ధ్యేయం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి
- 816 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు



మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న అందజేస్తున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

జనగామ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో జనగామ నియోజకవర్గంలోని జనగామ, బచ్చన్నపేట, జనగామ, తరిగొప్పుల, నర్మెట్ట మండలాలకు చెందిన 816 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని పిట్ట కథలు చెప్పి ప్రజలను బీఆర్‌ఎస్ మోసం చేసిందన్నారు. 10ఏళ్లలో (మిగతా 8వ పేజీలో)

అంతా ఉత్సాహం ఉంటే.. విప్పి చూపిస్తాం

- హరీశ్‌రావు వ్యాఖ్యలకు ఎంపీ కౌంటర్

బనకచర్ల ప్రాజెక్టు పేరుతో తెలంగాణలో సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం బీఆర్‌ఎస్ చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. జనగామ జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బనకచర్లపై అసెంబ్లీలో చర్చ పెడితే బట్టలు విప్పుతామంటూ హరీశ్ రావు బీఆర్‌ఎస్ వాళ్లకు అంత ఉత్సాహం ఉంటే తాము, తమ కార్యకర్తలం బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్‌కు వెళ్లి బట్టలు విప్పి నీకు, నీ బామ్మర్దికి చూపిస్తామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 2016లో ఆంధ్రాకు వెళ్లి చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని మాట్లాడిన కేసీఆర్.. తాజాగా తెలంగాణ సెంటిమెంట్‌ను తీసుకురావాలని చూస్తున్నారని మండిపడ్డారు.


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారకస్తూపం

దొరతనంపై రణకేతనం

- నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య
- వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో రగిలిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో ఆయన 79వ వర్ధంతి

దేవరుప్పుల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం.. భుక్తికోసం.. బానిస బంధాల విముక్తి కోసం.. వెట్టిచాకిరి నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్ దొర అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గుండాలు కాల్చి చంపి నేటికి(జూలై 4)79 ఏళ్లు పూర్తవుతున్నాయి.

తూటాలకు ఎదురొడ్డి..

విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండిలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామస్థులు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ముందు నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లో నుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్యలకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేలకొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితి నుంచి బయట పడ్డాడు.


దొడ్డి కొమురయ్య (ఊహా చిత్రం)

ఎగిసిన ఉద్యమం..

కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. కొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

దొరపై తిరబడి..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో 1928లో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు కొమురయ్య జన్మించాడు. కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. పాలకుర్తి మండలం విస్నూర్ కేంద్రంగా 60గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ పీడించేవారు. 1943లో ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రామకృష్ణారెడ్డి, పైండ్ల యాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో నాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు.

నేడు కడవెండిలో వర్ధంతి సభ

సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కడవెండిలో నిర్వహించే కొమురయ్య 79వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య కోరారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, రాష్ట్ర సమితీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డిలు హాజరవుతారని వెల్లడించారు.


ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు

ఉగ్రప్రభ త్వరితమాత అలంకరణలో అమ్మవారు

8వ రోజుకు చేరిన భద్రకాళి శాకంబరీ వేడుకలు

వరంగల్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ వేడుకలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యపూజ అనంతరం అష్టమికి ఆది దేవత శంకరుడు దశమహా విద్యల్లో కాళీక్రమంను అనుసరించి ఉదయం ఉగ్రప్రభ.. జ్ఞానశక్తిని త్వరితమాత గాను అలంకరించి పూజారాధన చేశారు. అమ్మవారి విభూతి అయిన ఈ ఉగ్రపభ మాతకు ప్రత్యంగిరా అనే నామం కూడా ఉంది. ఈ అమ్మవారు భక్తులను అనుగ్రహించి అభయమిస్తుందని అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలీసు అధికారుల సమీక్ష

ఈ నెల ఆషాడశుద్ధ పౌర్ణమి రోజు భద్రకాళి అమ్మవారి శాకంబరీ అలంకరణ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయంలో క్యూలైన్లు, ప్రసాదం, మంచినీరు, బాదంపాలు, మజ్జిగ పంపిణీ, వాటర్‌ప్రూఫ్ పరదాలు ఏర్పాటు చేయాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఆలయ ఈవో శేషభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, మట్టెవాడ సీఐ గోపి, ఎస్సై సాయికిరణ్, ట్రాఫిక్ పోలీసులు, ధర్మకర్తలు టి.వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, కాంత్రి, సతీష్, మయూరి, స్రవంతి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్య దక్షిణ యాత్రకు ప్రత్యేక రైలు

జనగామ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీవీ వెంకటేశ్ అన్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లో గురువారం ఐఆర్‌సీటీసీ టూరిజం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగం, తిరువణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండం, తిరుచ్చి, తంజావూరులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును హైదరాబాద్ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. జూలై 19 నుంచి జూలై 26 వరకు ప్రయాణం ఉంటుందని ఈ యాత్ర సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడురు మీదిగా రేణిగుంట వెళ్తుందన్నారు. అక్కడి నుంచి ఆలయాలకు ఉచితంగా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఒక్కొకరికి సాధారణ టికెట్ ధర రూ. 14,100, 3ఏసీ రూ.22,300, 2ఏసీ 29,200 ఉంటుందన్నారు. ప్రతీరైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు, కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అందుబాటులో ఉంటూ సౌకర్యాలను సమకురుస్తారని తెలిపారు. సీసీ కెమెరాలతో భద్రత, హోటళ్లు, భోజనం, వాటర్ బాటిల్స్ కూడా ఉచితంగా ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 9701360701, 9281030711, 9281030712 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు. అనంతరం తీర్థయాత్రలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. టూరిజం మానిటర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతున్న డ్రైవర్

నర్సంపేట టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురైన ఘటన గురువారం నర్సంపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న బస్సులో జరిగింది. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని ట్రాఫిక్ సిబ్బంది, పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా కొంత మంది డ్రైవర్ల తీరు మారడం లేదు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం క్షేమం అనే భరోసాతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను కాదని ఆర్టీసీని ఆశ్రయిస్తే.. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీపై నమ్మకం పోతున్నది. గురువారం ఉదయం 10 గంటల వరకు నర్సంపేట డిపోకు చెందిన టీఎస్ 03 యూబీ 8600 నెంబర్ గల బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ తన సెల్‌ఫోన్‌లో 20 నిమిషాల పాటు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

గోదావరిలోకి భారీగా వరద నీరు

- ఎగువ నుంచి 94,500 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో
- బ్యారేజీలోని 14 గేట్లు ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీళ్లు విడుదల

కన్నాయిగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ ప్రాజెక్టు వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి వరద నీరు భారీగా వచ్చి గోదావరిలో చేరింది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో తుపాకులగూడెం బ్యారేజీలోని 14 గేట్లు పైకి ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.925 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఇదిలాఉండగా, మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ప్రాజెక్టులోని ఫేస్-2లోని రెండు మోటార్ల ద్వారా భూపాలపల్లి జిల్లా భీంఘనపురం రిజర్వాయర్‌కు 494 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. సమ్మక్కసాగర్ వద్ద 79.65 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా, దేవాదుల ఇంటేక్‌వెల్ వద్ద 79.95 మీటర్ల నీటి మట్టం నమోదైంది.


కాళేశ్వరం వద్ద ప్రవహిస్తున్న గోదావరి


తుపాకులగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీళ్లు

కాళేశ్వరం వద్ద..

మహదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి 6మీటర్ల 30 సెంటీమీటర్ల వరకు వరదనీరు చేరింది. ఐదు రోజుల నుంచి నదీ ప్రవాహం పెరుగుతూ, తగ్గుతూ వస్తుండగా తాజాగా గురువారం కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వరద నీరు చేరి మెట్ల వద్దకు నీరు ఎగబాకింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతుండడంతో వరద నీరు పెద్ద ఎత్తున పెరిగింది.

మేడిగడ్డ బ్యారేజీకి 77,500 క్యూసెక్కుల నీరు

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరదనీరు పెరుగుతోంది. బ్యారేజీలోకి 77,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

ప్రాణం తీసిన పోలీసు భయం

- చల్వాయిలో ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం
- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టులు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య

గోవిందరావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేరు.. అమ్మమ్మే సర్వస్వం.. ఆపై పేదరికం.. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డాడు.. కానీ ఆయన ఆశలు నెరవేరలేదు.. లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదనకు లోనయ్యాడు.. ఊళ్లోని వాట్సాప్ గ్రూపులో తన బాధను పంచుకున్నాడు.. అయితే ఈ చాటింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకమని భావించిన పోలీసులు ఆ యువకుని మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.. విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని ఆదేశించారు.. భయంతో వణికిపోయిన అతడు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో గురువారం ఉదయం ఈ సంఘటన జరిగింది. పోలీసుల భయంతో చుక్క రమేష్ (29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. చుక్క స్వరూప-గట్టయ్య దంపతులకు రమేష్, మౌనిక సంతానం. అనారోగ్యంతో స్వరూప, గట్టయ్యలు కొన్నేళ్లక్రితం మృతి చెందారు. మౌనికకు వివాహమై అత్త వారింటికి వెళ్లగా రమేష్ చల్వాయిలోని తన అమ్మమ్మ శెట్టి విశాల వద్ద ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన ఆయన కొద్దిరోజుల క్రితం చల్వాయికి వచ్చాడు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా జాబితాలో పేరు రాలేదు. తనకు అన్ని అర్హతలున్నా ఇల్లును మంజూరు చేయలేదని, అనర్హులకు ఇచ్చారంటూ 'చల్వాయి సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టాడు.


చల్వాయిలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, బీఆర్‌ఎస్ నాయకులు

ఇదే గ్రూపులో సభ్యులుగా పస్రా ఎస్సైతోపాటు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల అభిమానులు ఒకరినొకరు విమర్శించుకుంటూ పోస్టులు పెట్టుకున్నారు. మంత్రి సీతక్క, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్త నాగన్న పేరిట సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన లేఖను రమేష్ ఈ గ్రూపులో పోస్టు చేశాడు.

వాట్సాప్ గ్రూపులో పోస్టుల యుద్ధాన్ని పస్రా ఎస్సై కమలాకర్ గమనించారు. ఆయన ఆదేశాలతో బుధవారం సాయంత్రం చల్వాయికి వచ్చిన ఓ పోలీసు కానిస్టేబుల్... రమేష్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాడు. గురువారం స్టేషన్‌కు రావాలని సూచించాడు. తనపై కేసులు పెడతారేమోనని రమేష్ భయాందోళనకు గురయ్యాడు. అమ్మమ్మ బంధువుల ఇంటికి వెళ్లడంతో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో రమేష్ దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింట్లో ఉండే అలుగం రమేష్ అనే వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారికి తెలిపాడు. విషయం తెలుసుకున్న పస్రా ఎస్సై కమలాకర్ చల్వాయికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇంట్లో వెతకగా రమేష్ రాసిన సూసైడ్ నోట్ లభ్యమైనట్లు తెలిసింది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న మనవడు ఆత్మహత్య చేసుకోవడంతో అమ్మమ్మ విశాల గుండెలవిసేలా రోదించింది.

రమేష్‌ది ప్రభుత్వ హత్య

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, జర్నలిస్టులు, సామాన్యులపై రాష్ట్రమంత్రి సీతక్క అనుచరులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని ధ్వజమెత్తారు. ములుగు ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద రమేష్ మృతదేహానికి నివాళులర్పించిన ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. అమాయక యువకుడి మృతికి మంత్రి సీతక్క బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మృతదేహంతో ఆందోళన

కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే చుక్క రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రమేష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించిన వారిపై భౌతికదాడులకు పాల్పడటమేకాక ఆత్మహత్యకు ప్రేరేపించేలా భయభ్రాంతులకు పాల్పడటం ములుగు జిల్లాలో కాంగ్రెస్ నాయకులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ములుగు సర్కిల్ పోలీసులు కూడా చల్వాయిలో మోహరించారు. రాస్తారోకో ప్రభావంతో రహదారికి ఇరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనను విరమింపజేసిన పోలీసులు రమేష్ మృతదేహాన్ని ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మృతుడి అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.50వేలు అందజేశారు.

వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు

చుక్క రమేష్ అమ్మమ్మ శెట్టి విశాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మ హత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ న్యూసెన్స్ అంశంపై బుధవారం సాయంత్రం డయల్ 100కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పస్రా పోలీసులు చల్వాయికి వెళ్లారని, మద్యం సేవించిన స్థితిలో రమేష్ ఉన్నట్లు గుర్తించి తిరిగి వెళ్లిపోయారని తెలి పారు. మృతుడు రమేష్‌పై ఎటువంటి కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

రవీందర్, ములుగు డీఎస్పీ

(5వ పేజీ తరువాయి)

ఉద్యాన పంటలపై ఉత్సాహం

మార్పులు తీసుకురావాలన్న ప్రధా న ఉద్దేశంతో ఆయిల్ పామ్ తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహి స్తోంది. ఆసక్తి చూపే అన్నదాతలకు అన్ని విధాలా మేలు చేకూర్చేందుకు కృషిచేస్తోంది. మొక్కలకు సబ్సిడీ అందించడంతోపాటు బిందు సేద్యం ద్వారా నీరు అందించేందుకు డ్రిప్ పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. సాగుకు తక్కువ మొత్తంలో ఖర్చు కావడం, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుండడం.. తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడం వంటి కారణాలతో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో పలు చోట్ల అన్నదాతలు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్‌పామ్ మొక్కల పెంపకాన్ని చేపట్టగా, ఇప్పటి వరకు మొత్తం 6,900 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్‌ను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 22 మంది రైతులు ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి పొందినట్లు అధికారులు చెబుతున్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించడమే ధ్యేయం

వారు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటూ సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరినా కేసీఆర్ రాలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో భూ భారతి సదస్సులను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించి సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నామని, సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టి నిరుపేదలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. సన్న ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధరతోపాటు రూ.500బోనస్ ఇచ్చామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఆర్డీవో గోపీరామ్, హౌసింగ్ పీడీ మాతృనాయక్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా కమిటీ ఎన్నిక



వేణుగోపాల్ (అధ్యక్షుడు), రవి(కార్యదర్శి)

జనగామ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యూపీపీటీఎస్) జిల్లా కమిటీని గురువారం ఎన్నుకున్నారు. జనగామలోని దుర్గాకాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములుకనూరి శంకర్, గౌరవ అధ్యక్షుడు కొండ యాదగిరి సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కొయ్యడ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా జెరిపోతుల రవి, ఉపాధ్యక్షులుగా చకిలం శ్రీనివాస్, బి.కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పెంబర్తి ప్రకాష్, మాజోజు కృష్ణమూర్తి, గౌరవ సలహాదారుగా ధైద రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా బెజుగం కళావతి, సంయుక్త కార్యదర్శిగా పుప్పాల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక



లింగాలఘనపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): లింగాలఘనపురం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు కాముని రాము ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మైలారం అనిల్, ఉపాధ్యక్షుడిగా కొండ ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా పసునూరి ఉపేందర్, కోశాధికారిగా రావుల భాస్కర్, సహాయ కార్యదర్శిగా గుండు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా పి.వెంకటేష్, తండా సాయి కిరణ్, లంబడి కృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, అనిల్, అక్బర్, విజయ్ కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

సమ్మెను సక్సెస్ చేయాలి

జఫర్‌గఢ్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అన్నారు. కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం జఫర్‌గఢ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలపై 9న దేశవ్యాప్తంగా నిర్వ హించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

● రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల కమిటీ సమావేశానికి మంచాల మల్లేష్ అధ్యక్షత వహించగా రాజు మాట్లాడారు.

కరెంట్ వైర్లతో గోస

● విద్యుత్ లైన్లతో లబ్ధిదారులకు ఇక్కట్లు ● డైవర్ట్ చేయాలని అధికారులకు వినతి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం గుర్తించిన స్థలంపై వెళ్లిన విద్యుత్తు లైన్

చిలుపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మొదటి విడత ఇళ్ల నిర్మాణానికి విద్యుత్ లైన్ల సమస్య ఎదురవుతోంది. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు వారివారి సొంత స్థలాల్లో ఇంటిని నిర్మించుకునేందుకు అధికారులు అనుమతులివ్వడమే కాకుండా జియో ట్యాగింగ్ చేశారు. ఇంటిని నిర్మించేందుకు ఉపక్రమిస్తున్న లబ్ధిదారులకు విద్యుత్తు లైన్ల సమస్య ఎదురవుతోంది. ఆయా గ్రామాల్లో పదుల సంఖ్యలో ఇలాంటి సమస్యలే ఎదురవడంతో ట్రాన్స్‌కో అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో ఒక్కో లైన్‌తోపాటు, ట్రాన్స్‌ఫార్మర్స్ షిఫ్టింగ్ కోసం ఎస్టిమేషన్ మేరకు డీడీలు చెల్లిస్తేనే తప్ప సమస్యకు పరిష్కారం చూపలేమని బదులివ్వడమే కాకుండా, లబ్ధిదారులతో వ్యక్తిగతంగా అఫిడవిట్‌ను కూడా తీసుకుంటున్నట్లు తెలిసింది. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

నిబంధనల మేరకే: లక్ష్మీనారాయణ, ఏఈ, చిలుపూర్



గ్రామాల్లో విద్యుత్తు లైన్, ట్రాన్స్‌ఫార్మర్స్ షిఫ్టింగ్ తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. ఈ విషయంలో నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ప్రదేశాల్లో లైన్లు మార్చాలంటే అక్కడ ఉన్న పరిస్థితిని బట్టి ఎస్టిమేషన్ ప్రకారం డీడీలు చెల్లించాలి. ఉన్నతాధికారుల ఆదేశాలను శిరసావహిస్తాం.

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు : కలెక్టర్

జనగామ కల్చరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బడిబాట నమోదు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ, పదవ తరగతి అయిపోయిన విద్యార్థులు ఇంటర్‌లో చేరడం, పదవ తరగతి పరీక్షలపై ముందస్తు కార్యాచరణ (విజయోస్తు 2.0) తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చేలా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీచర్ల అటెండెన్స్‌కు సంబంధించి ప్రతీ రోజు నివేదిక సమర్పించాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా శానిటేషన్ పక్కాగా ఉండాలన్నారు. కిచెన్ రూమ్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పాసయిన విద్యార్థులు ఇంటర్‌లో చేరేలా మానిటరింగ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఈవో డి.భోజన్న, ఎంఈవోలు, ఎస్‌వోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలు తెలుసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నియమాలను బీఎల్వోలు విధిగా తెలుసుకోవాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఎల్వోలకు నిర్వహించిన ఎన్నికల శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతీ బీఎల్వో ఎన్నికలకు సంబంధించిన విషయాలను తె లుసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో బూత్ స్థాయిలో బీఎల్వోల పాత్ర కీలకమన్నారు. ఆన్‌లైన్లో నిర్వహించే విధులపై అప్రమత్తంగా ఉండి సంబంధిత అంశాలకు సంబంధించిన శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ట్రైనర్స్ రాజేందర్, నరేందర్, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

● మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆర్డీవో వెంకన్న గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపీ నమోదు రిజిస్టర్‌లను పరిశీలించారు.



శిక్షణ తరగతులను వీక్షిస్తున్న ఆర్డీవో వెంకన్న

వార్డులను పరిశీలించి శుభ్రతను పాటించాలని సూచించారు. వార్డుల్లో ఉన్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు అందుతున్నాయా, మందులు ఇస్తున్నారా, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు.



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

విద్యార్థికి ఎల్‌వోసీ అందించిన ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సముద్రాల గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాస్కుల జితేందర్-రాజీనా దంపతుల కుమార్తె బాస్కుల విన్సీప్రియ అనారోగ్యానికి గురికాగా నిమ్స్‌లో బాలిక వైద్యానికి అయ్యే ఖర్చులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.2లక్షల ఎల్ఓసీని హన్మకొండలోని ఆయన నివాసంలో గురువారం అందించారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలబడుతుందని, ఎల్‌వోసీల ద్వారా, సీఎంఆర్ఎఫ్‌ల ద్వారా పేద ప్రజలకు అండగా సీఎం రేవంత్ రెడ్డి చేయూతను అందిస్తున్నాడని కడియం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని కోడలు.. గుండెపోటుతో మామ..



ఝాన్సీ (ఫైల్)

పెద్దవంగర, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబంలో ఇ ద్దరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. వేముల సంతోష్-వేముల ఝాన్సీ 2011లో వివాహం జరిగింది. వారికి కుమారుడు అఖి ల్ తేజ, కుమార్తె అభిదామాని ఉన్నారు. సంతోష్ పెద్దవంగర మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో సీఆర్పీగా, ఝాన్సీ తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఝాన్సీ పని చేస్తున్న విద్యసంస్థలో ఒకరు ఆమెను మందలించారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఝాన్సీ (35) గురువారం ఇంటివద్దనే ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రై వేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, రెండు రోజుల కిందట విద్యా సంస్థలో ఒకరు మందలించారని తీవ్ర మనస్థాపం చెందింది. పాఠశాలకు ఇక వెళ్లనని భర్తకు చెప్పి ఇంటి వద్దనే ఉంటున్నది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కోడలి మరణ వార్త తెలియడంతో కొద్ది రోజులుగా గుండెనొప్పితో బాధపడుతున్న మామ వేముల లక్ష్మయ్య గుండెపోటుతో మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే ఒకే ఇంట్లో కోడలు, మామ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రిసార్ట్‌లో యువకుడి మృతి



కిరణ్(ఫైల్)

చిలుపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో రిసార్ట్‌లో యువకుడు మృతిచెందిన ఘటన రాజవరం సమీపంలోని తన్మయ రిసార్ట్‌లో గురువారం జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేటకు చెందిన చెవుల కిరణ్(27) స్నేహితులతో కలిసి బుధవారం సాయంత్రం రిసార్ట్‌కు చేరుకున్నారు. భోజనం అనంతరం గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. స్నేహితులు ఎంజీఎంకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కిరణ్‌కు మూడేళ్ల క్రితం వివాహం కాగా, హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'మా భూమిని లాక్కునే కుట్ర'

బచ్చన్నపేట జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ప్లాట్ల కోసం 32 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిని, తిరిగి సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, రెవెన్యూ అధికారులు మ్యూటేషన్ చేయకుండా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలంటూ కొన్నె గ్రామానికి చెందిన బీడీ కార్మికులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద కోడూరి శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు అధికారులను కలిసిన అనంతరం మాట్లాడారు. కొన్నెలో 98 మంది బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాల కోసం 1993లో చొప్పరి ఆగమ్మ వద్ద నాలుగెకరాలు కొనుగోలు చేశామన్నారు. 1.15 ఎకరాలు కాలువ కోసం చేసిన భూసేకరణలో పోయిందని, మిగతా భూమిని ఆగమ్మ వారసులు మ్యూటేషన్ చేసుకుని, కాజేసేందుకు యత్నాలు చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో అనసూయ, కనకవ్వ, రమ్య, పద్మ పాల్గొన్నారు.

మార్కెట్ వైస్‌చైర్మన్‌ను తొలగించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మార్కెట్ సెక్రటరీపై దాడి చేసిన వైస్‌చైర్మన్‌ను పదవి నుంచి తొలగించే వరకు ఊరుకోబోమని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ జన్ను భాస్కర్ డిమాండ్ చేశారు. మార్కెట్ సెక్రటరీ పై దాడికి నిరసనగా మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట గురువారం మార్కెట్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సెక్రటరీపై దాడి చేసిన వైస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది అలీ, రాంచందర్, వెంకటేష్, డేవిడ్, ప్రవీణ్, అనిల్, అశోక్, ప్రశాంత్, లక్ష్మి పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి

జనగామ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని ఎమెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. తుంటి శస్త్రచికిత్స జరిగి విశ్రాంతి తీసుకుంటున్న ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గ నాయకులతో గురువారం మాట్లాడారు. స్థానిక ఎన్నికల కోసం గెలుపు గుర్రాలనే ఎంపిక చేయాలన్నారు. వారం రోజుల్లోగా అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన అభిప్రాయాలను ఇవ్వాలని మండల నాయకులు, ఇంచార్జులకు సూచించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. మంజూరై సిద్ధంగా ఉన్న కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మూడు రోజుల్లోగా తహసీల్దార్ల చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

జఫర్‌గఢ్, జూలై 3(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో వరి పంట సాగు కోసం సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కరుణాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌లో వరి సాగుకై ఆర్ఎన్ఆర్, కెఎన్ఎం, ఎంటీయు- 1010 రకంతో పాటు వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తోందన్నారు. 25కిలోలు, 10కిలోల బ్యాగులు వ్యవసాయ కార్యాలయంతో పాటు ఆయా క్లస్టర్లలోని రైతు వేదికల్లో అందుబాటులో ఉన్నాయని, బ్యాగుపై60శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

నర్మెట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నర్మెట మండల నూతన తహసీల్దార్‌గా మొహసీన్ ముజ్తబా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన కేవీ రామానుజచారి బదిలీపై బచ్చన్నపేటకు వెళ్లగా, రఘునాథపల్లిలో తహసీల్దార్‌గా ఉన్న మొహసీన్ ముజ్తబా బదిలీపై నర్మెటకు వచ్చారు.

● రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లి తహసీల్దార్‌గా ఫణి కిషోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మోహ్సిన్ ముజ్తబ పట్టుమని పది నెలలు కూడా కాక ముందే అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలను ఎదుర్కోవడంతో కలెక్టర్ బదిలీ వేటు వేసి నర్మెటకు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బచ్చన్నపేట డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ఫణికిషోర్ పదోన్నతిపై రఘునాథపల్లి తహసీల్దార్‌గా వచ్చారు.

● బచ్చన్నపేట (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట తహసీల్దార్‌గా రామానుజా చారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికిశోర్ రఘునాథపల్లికి బదిలీ కాగా, నర్మెటలో పనిచేస్తున్న కేవీ రామానుజాచారి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శంకర్ విధుల్లో చేరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్లు మొహసీన్ ముజ్తబా (నర్మెట), ఫణికిషోర్ (రఘునాథపల్లి) రామానుజాచారి(బచ్చన్నపేట)

గోదారి జలాలు అందించాలని వినతి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తరిగొప్పుల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఫేజ్ 2 పనుల్లో భాగంగా చేపడుతున్న ఎత్తిపోతల పైపులైన్ ద్వారాతమ గ్రామానికి చెందిన ఊరకుంటకు గోదావరి జలాలందించాలనికోరుతూ నర్సాపూర్‌కు చెందిన రైతులు గురువారం ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా మల్లన్నగండి (గండి రామవరం) రిజర్వాయర్ నుంచి తరిగొప్పుల మండలంలోని బొత్తలపర్రెలో నిర్మిస్తున్న మినీ రిజర్వాయర్‌కు పైపులైన్ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు పనులు చేపట్టారన్నారు. ఇదే పైపులైన్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు ప్రణాళిక సిద్ధం చేసిన నీటిపారుదలశాఖ అధికారులు తమ గ్రామంలోని ఊరకుంటను మరిచారని, అదే పైపులైన్‌కు అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, నాయకుడు అర్జుల సుధాకర్ రెడ్డి, రైతులు ఇరుమల్ల సమ్మయ్య, చిక్కొండ పోషయ్య, గుంటి కిష్టయ్య, తుపాకుల సంపత్, గుంటి సమ్మయ్య, తరాల సమ్మయ్య, ఎర్రవెల్లి కృష్ణ, ఎర్రం మహేష్ పాల్గొన్నారు.

ఖర్గే సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న దుద్దిల్ల శ్రీనుబాబు, చిత్రంలో ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్‌బీస్టేడియంలో నేడు(శుక్రవారం) జరిగే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల బాబు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి శ్రీనుబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం కోసం, కార్యకర్తల్లో సమష్టి నాయకత్వం ప్రోత్సహించేందుకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో పల్లె శ్రీనివాస్‌గౌడ్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, లావుడ్యా భాస్కర్, జాటోతు నెహ్రూనాయక్, మేకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

249 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



జనగామలో ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు

నర్మెట, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన 249మంది లబ్ధిదారులకు గురువారం జిల్లా కేంద్రంలో ఇందిరమ్మఇళ్ల పట్టాలను అందించినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ పేదవాడికి న్యాయం జరుగుతుందన్నారు. ఇంటి కోసం ఎదురు చూస్తున్న పేద ప్రజలకు ఈ పట్టాలు వారి కలలను సాకారం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, నాయకులు పరీదుల యాదయ్య, చెవుల పరశురాములు, భూక్య జయరాం, రామకృష్ణ, వలబోజు శ్రీనివాస్, కాలువ అశోక్, బాలనర్సు పాల్గొన్నారు.

వీధుల్లో పర్యటించిన కమిషనర్



శివునిపల్లిలో పరిశీలిస్తున్న కమిషనర్ రాధాకృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై3(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధిలో భాగంగా మునిసిపల్ కమిషనర్ రారాకృష్ణ, సిబ్బంది, నాయకులతో కలిసి మునిసిపాలిటీ పరిధిలోని శివునిపల్లి, చాగల్ పరిధిలో పలు వీధులను గురువారం పరిశీలించారు. మునిసిపల్ ఏఈ వంశీకృష్ణ మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.60కోట్ల నిధులు రానున్నాయని అందులో భాగంగానే వివిధ అభివృద్ధి పనులకు ఎస్టీమేషన్స్ రూపొందించడం జరుగుతుందన్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. శుక్రవారం ఘన్‌పూర్ పరిధిలో పర్యటించిన తర్వాత మూడు ప్రాంతాలకు చెందిన నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జూనియర్ సెక్రటరీలు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సందీప్, నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, బూర్ల శంకర్, పోశాల కృష్ణమూర్తి, చిగురు విజయ్‌పటేల్, కనకం రమేష్, పోగుల సారంగపాణి, ఐలపాక శ్రీనివాస్, ఫాతికుమార్, నీల రాములు, గుర్రం రాజు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్



జనగామ కల్చరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రహత్ ఖానమ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎ.నర్సయ్య జూన్ 30న పదవీ విరమణ చేయగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న రహత్‌ఖానమ్ ప్రిన్సిపాల్‌గా వచ్చారు.